



- ఎంత గొప్పగా జీవించావో నీ చేతులు చెప్పాలి. ఎంత గొప్పగా మరణించావో ఇతరులు చెప్పాలి


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 220 | సోమవారం 02 ఫిబ్రవరి 2026 | పేజీలు : 9 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## 2026-27 ఆర్థిక సంవత్సరానికి

# రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్

- మూలధన వ్యయాన్ని రూ.12.2 లక్షల కోట్లకు పెంచిన కేంద్ర ప్రభుత్వం
- బయోఫార్మా, ఎంఎస్ఎంఈ రంగాలకు చెరో రూ.10,000 కోట్ల నిధులు
- వ్యక్తిగత అవసరాల దిగుమతులపై కస్టమ్స్ సుంకం 10 శాతానికి తగ్గింపు
- ఏప్రిల్ 2026 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం

అమరావతి– సూర్య వాస్తవం:

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. యువశక్తిని చోదకశక్తిగా చేసుకుని, పేదలు, అణగారిన వర్గాల ప్రగతి లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆమె తెలిపారు. మొత్తం రూ.53.47 లక్షల కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ బడ్జెట్‌లో స్థిరమైన ఆర్థిక వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' దార్శనికతతో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం అనే మూడు ప్రధాన కర్తవ్యాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

**ప్రధాన కేటాయింపులు, ఆర్థిక అంచనాలు**

2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం రూ.53.47 లక్షల కోట్లుగా అంచనా వేయగా, మొత్తం రాబడులు (అప్పులు మినహా) రూ.36.5 లక్షల కోట్లుగా ఉంటాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. కేంద్ర నికర పన్ను రాబడులు రూ.28.7 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

- మిగతా 2లో..

# వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్



- కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను స్వాగతించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రికి అభినందనలు తెలిపిన సీఎం

కుప్పం – సూర్య వాస్తవం:

వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ రూపొందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్ ను నిర్దేశించేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పై సీఎం మీడియా సమావేశంలో స్పందించారు. కేంద్ర బడ్జెట్ ను స్వాగతిస్తున్నట్టు ఆయన తెలిపారు. అభివృద్ధికి దోహదపడేలా బడ్జెట్ ను తీర్చిదిద్దినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఫార్వార్డ్ లుకింగ్ బడ్జెట్. రాష్ట్రం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఈ బడ్జెట్ మరింత సహకరించేలా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్ప టికే ఎంఎస్ఎంఈలపై ఎక్కువగా దృష్టి సారించింది. వీటిని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉంది. మహిళలు, రైతులు, యువత సాధికారిత సాధించేలా బడ్జెట్ ఉంది. 2047 వికసిత్ భారత్ డెవలప్డ్ ఎకానమీగా

- మిగతా 2లో..

# నేరపూరిత రాజకీయాలే వైసీపీ సంస్కృతి

- వైసీపీ హయాంలో రాజకీయాలు నేరమయం అయ్యాయన్న చంద్రబాబు
- తాము అధికారంలోకి వచ్చాక చట్టబద్ధ పాలన నెలకొల్పామని వెల్లడి
- నిరాశ, నిస్పృహలతోనే వైసీపీ నేతలు తిట్లకు దిగుతున్నారని విమర్శ
- శాంతిభద్రతలను ఉల్లంఘిస్తే ఎవరినీ వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ

2లో



## ఆదంపూర్ విమానాశ్రయానికి 'గురు రవిదాస్' పేరు

- పంజాబ్‌లో ప్రధాని పర్యటన

జలంధర్ – సూర్య వాస్తవం

పంజాబ్‌లోని జలంధర్ జిల్లాలో ఉన్న ఆదంపూర్ విమానాశ్రయం పేరును ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదివారం మార్చారు. దీనికి గురు రవిదాస్ మహారాజ్ జీ విమానాశ్రయం అనే కొత్త పేరు పెట్టారు. విమానాశ్రయంలో గురు రవిదాస్ 649వ జయంతి

- మిగతా 2లో..

## అంబటి, జోగి రమేశ్ ఇళ్లపై

# దాడి వెనుక చంద్రబాబు ఉన్నారు

- జోగి రమేశ్ ఇంటికి నిప్పు... తీవ్రంగా స్పందించిన జగన్
- తప్పుడు ఆరోపణలు రుజువవడంతో జీర్ణించుకోలేకే ఈ దాడులని విమర్శ
- రాష్ట్రంలో అరాచక, ఆటవిక పాలన సాగు తోందని వ్యాఖ్య
- ఈ నిప్పు చంద్రబాబు ప్రభుత్వాన్నే దహించివేస్తుందని హెచ్చరిక



2లో

## బడ్జెట్‌లో ఏపీకి వచ్చింది

# గుండు సున్నా



- కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శ
- ఎన్డీయేలో చంద్రబాబు కీలక పాత్రలో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరలేదని ఆరోపణ
- అమరావతికి నిధులు ఇవ్వకుండా అప్పులు అంటగట్టడం దుర్మార్గమని వ్యాఖ్య
- పోలవరం ప్రాజెక్టుకు నిధులు తగ్గించి, ఎత్తు తగ్గించే కుట్ర చేస్తున్నారని ఫైర్
- విభజన హామీలు, ప్రత్యేక హోదాను కేంద్రం పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం

అమరావతి– సూర్య వాస్తవం:

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్డీయే ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక భాగస్వామిగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో విఫలమయ్యారని, 50 లక్షల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌లో ఏపీకి లభించింది గుండు సున్నా అని ఆమె విమర్శించారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రులను దగా

- మిగతా 2లో..



## అంబటి రాంబాబుకు

# 14 రోజుల రిమాండ్

- సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అంబటి రాంబాబును అరెస్టు చేసిన పోలీసులు
- అంబటి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్
- న్యాయాధికారి ఉత్తర్వులతో అంబటిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలింపు

అమరావతి– సూర్య వాస్తవం:

వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు గుంటూరు మొబైల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో పోలీసులు శనివారం రాత్రి ఆయనను అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. విషయంలోకి వెళితే.. గుంటూరు అమరావతి రోడ్డులోని గోరంట్ల వద్ద శుక్రవారం

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## జిల్లాలో నో హెల్మెట్ - నో పెట్రోల్



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం:** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు... జిల్లాలో రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో "నో హెల్మెట్ – నో పెట్రోల్" నిబంధనను అమలు చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి పెట్రోల్ వేయించుకునే ద్విచక్ర వాహన చోదకులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎం.జి. పెట్రోల్ బంక్ వద్ద హెల్మెట్ ధరించి వచ్చిన ద్విచక్ర వాహన దారులకు సిల్వర్ కాయిన్లు, రోజా పూలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ముడవ పట్టణ టౌన్, నాల్గవ పట్టణ సిఐలు రాజేంద్రనాథ్ యాదవ్, జగదీష్‌లు పెట్రోల్ బంకు యజమాని, సిబ్బంది హెల్మెట్ ధరించిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమం ద్వారా హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల్లో సానుకూల స్పందన నెలకొంది. పోలీసు అధికారులు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## అంగరంగ వైభవంగా తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి రథోత్సవం

**- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే జయరాం**





**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలం తొండపాడు బొల్లికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి వారి కళ్యాణోత్సవం వేద మంత్రాల నడుమ కన్నుల పండువగా సాగింది. ఈ వేడుకకు ఎమ్మె ల్యే గుమ్మనూరు జయరాం హాజరై స్వామి వారిని దర్శించుకుని అనంతరం రథం లాగి ప్రారంభించారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.భ క్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని తిలకించి పునీ తులయ్యారు.ఆర్య సంఘం అధ్యక్షు డు మాకం శ్రీకాంత్ ఎమ్మెల్యేకి శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం రథం ఉత్సవాల్లో పాల్గొన్నారు. కొంగుబంగారంగా వెలుగొందుతున్న బొలికొండ రంగనాథ స్వామి ఉత్స వాలు అనంతపురం జిల్లా గుత్తి మండల పరిధిలోని తొండపాడు గ్రామం లో వెలిసిన బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఏటా మా ఘ శుద్ధ సప్తమి నుంచి పౌర్ణమి వరకు అంగరంగ వైభవంగా ఆదివారం తేదీ తెల్లవారుజామున కళ్యాణోత్సవం జరిగింది. ఈ సాయంత్రం మూడు గంటల 30 నిమిషాలకు స్వామివారి బ్రహ్మ రథో త్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారి తిలకించి రాయలసీమ జిల్లాల నుంచి నేకాకుండా కర్ణాటక, తమిళ నాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడం జరిగింది. ఈ ఉత్సవాలకు తొందపాడుతో పాటు చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న

# మట్టి ముఠాను ఆపాలి

- **ప్రజలను మభ్యపెట్టేందుకు సోషల్ మీడియాలో పోస్టింగ్లు పెట్టడం**
- **హుల్లికల్లు చెరువు మట్టి తవ్వడానికి పర్మిషన్లు ఎవరిచ్చారు**
- **మట్టి దోపిడీపై నేషనల్ గ్రీన్ ట్రిబనల్ ఆశ్రయిస్తాం**
- **చిందనూరు నాగరాజు బహుజన్ సమాజ్ పార్టీ**



**రాయదుర్గం – సూర్య వాస్తవం :** ప్రజాధనాన్ని డ్యూటీ చేస్తున్న మట్టి మాఫియాను ఆపాలని సింధనూర్ నాగరాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బహుజన పార్టీ చిందనూర్ నాగరాజు మాట్లాడుతూ... ప్రజలను మభ్య పెట్టేందుకు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. డి.హిరేహాళ్ మండలం హులికల్లు చెరువు నుండి భారీ స్థాయిలో మట్టి దోపిడీకి సంబంధించి సోషల్ మీడియాలో ఊరు పేరు లేకుండా మట్టి దోపిడీని సమర్థించుకుంటూ సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టడం హాస్యాస్పదం, మట్టి దోపిడీదారులు తమ దోపిడీని సమర్థించుకోవడానికి చేసిన కుట్ర. దయచేసి ప్రజలు మట్టి దోపిడీ ముఠా యొక్క దుర్బుద్ధిని అర్థం చేసుకోవాలని నేను కోరుతున్నాను. దానికి సంబంధించి పూర్తి వివరాలను నేను తెలియజేస్తున్నాను. నేను చిన్న నీటి పారుదల శాఖ డి. ఈ. గారితో మాట్లాడడం జరిగింది అలాగే నీటిపారుదల శాఖ ఎస్.ఈతో కూడా మాట్లాడడం జరిగింది దాన్ని బట్టి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు పూర్తిగా భోగస్ అని తేలింది. ప్రకటన విడుదల చేసినటువంటి వ్యక్తి ఎవరు, అతని పేరు ఏమిటి అతనికీ డిఎంసి సంస్థకీ సంబంధం ఏమిటి, ఏ అధికారంతో అతను ప్రకటన విడుదల చేశాడు, డిఎంసి సంస్థలో అతని హోదా ఏమిటి అనే వివరాలు లేకుండా ప్రకటన విడుదల చేయడాన్ని బట్టి ఇది పూర్తిగా ఒక బోగస్ ప్రకటన అని తేలిపోయింది.ఆర్ అండ్ బి శాఖ ఎస్.ఈ గారు రోడ్డు వేయడానికి మాత్రం అనుమతులు ఇచ్చారు. కానీ ఆ రోడ్డుకు కావలసిన మట్టిని చెరువు నుండి దోపిడీ చేయడానికి అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం ఉన్న నియమ నిబంధనల ప్రకారం చెరువులో పూడిక తీయడానికి మాత్రం అది కూడా ఆ మట్టిని రైతుల పొలాలకు తరలించడానికి మాత్రమే అవకాశం ఉంది. రైతులకు అవసరమైతే ప్రభుత్వం నిర్ణయించిన రుసుము చెల్లించి పూడిక మట్టిని తమ పొలాలకు తరలించుకోవచ్చు. పూడికకు మించి ఒక ఇంచు కూడా చెరువుని తవ్వడానికి ఎలాంటి అవకాశం లేదు. పూడిక తీసిన మట్టి బంక బంకగా ఉండి అది రోడ్డుకు పనికిరాదు ఇది అందరికీ తెలిసిన విషయము. రోడ్డు వేయడానికి గ్రావెల్ అవసరమైతే లోతుగా తవ్వి మట్టిని తీసుకోవలసి వస్తుంది కానీ చెరువులో పూడిక లెవెల్ తప్ప అంతకన్నా ఎక్కువ తవ్వడానికి అవకాశం లేదు అలా తవ్వితే అది చట్టరీత్యా నేరం. మట్టి దోపిడీ చేస్తున్న ముఠా ఇంకొక పెద్ద డ్రామా ఆడుతున్నారు మట్టి తీసుకున్నందుకు ప్రభుత్వం సీనరేజ్ చార్జీలు పట్టుకుంటుందని అందువల్ల తను మట్టిని తరలిస్తున్నామని వితండవాదం చేస్తున్నారు,సీనరేజీ చార్జీలు కేవలం ప్రభుత్వానికి చెల్లించవలసిన రాయల్టీ మాత్రమే అంతే కానీ అది మట్టికి రేటు కాదు, ఒక వస్తువు విలువ వేరే ఉంటుంది దానిపై చెల్లించాల్సిన పన్ను వేరే ఉంటుంది, పన్ను చెల్లించినంత మాత్రం వస్తువు విలువ కట్టినట్లు కాదు? మట్టికి పన్ను మాత్రమే కడితే మట్టికి రేటు కట్టేది ఎవరు? వెయ్యి రూపాయల వస్తువుపై వంద రూపాయలు పన్నులు మాత్రం చెల్లిస్తే ఆ వస్తువును తీసుకొని పోవచ్చా? కాంట్రాక్టర్ రోడ్డు వేయడానికి మట్టి రేటు, దానిపై రాయల్టీ, దానిని ఉన్న చోట నుంచి రోడ్డు వేసే చోట వరకు తరలించేందుకు ఎంత దూరం ఉందో లెక్క వేసి దానికి అయ్యే రవాణా ఖర్చులు మొత్తం చెల్లిస్తారు అలాంటప్పుడు కేవలం రాయల్టీ లేదా సినరేజీ మాత్రం కట్టి, మట్టిని దొంగతనం చేసి దోచేస్తారంటే అది కుదరదు? దొంగతనం చేసిన వస్తువు రేటు ఎంతైనా పర్వాలేదు దానిపైన కేవలం పన్నులు కట్టేస్తే దొంగతనం మాఫీ అవుతుందా? మీ కన్నా బుద్ధిమంతులు ఇంకెవరూ ఉండరా ఈ భూమి మీద?
చివరికి మేము చెప్పదలుచుకున్నది ఏమిటంటే చెరువు నుంచి పూడిక తీసిన మట్టిని మాత్రం రైతులు తరలించుకోవచ్చు అది తప్ప ఇతరత్రా చెరువును తవ్వడానికి అవకాశం లేదు, చెరువు పూడిక తీసిన మట్టి రోడ్డుకు పనికిరాదు, లోతుకు తవ్వడానికి అవకాశం లేదు అంటే దీనిని బట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులో మట్టి తవ్వడానికి అనుమతులు ఇవ్వడానికి ఎవ్వరికీ ఎలాంటి అధికారం లేదు. అలా ఏమైనా అక్రమంగా అనుమతులు ఇచ్చి ఉంటే వాళ్ళు జైలుకు పోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎవరైనా అనుమతి ఇచ్చి ఉంటే అనుమతి పత్రాలను ముందు చూపించి తర్వాత మాట్లాడవలసినది. కాంట్రాక్టర్లు అనవసరమైన పోస్టులు సోషల్ మీడియాలో పెట్టి రాజకీయ నాయకులకే రాజకీయ పాటలు నేర్పించవలసిన అవసరం లేదు.

ఇకపై మట్టి దోపిడీ ఇలాగే కొనసాగితే తప్పకుండా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లేదా గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి అటు అవకాశం కల్పించిన అధికారుల పైన ఇటు మట్టి దోపిడీ చేసిన కాంట్రాక్టర్ల పైన కూడా కేసులు వేయడం జరుగుతుందని బహుజన సమాజ్ పార్టీ తరపున హెచ్చరిస్తున్నామని అన్నారు.

# అప్పజెప్పిన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తా

- **ఓజిలి మండలంలో టీడీపీ బలోపేతమే లక్ష్యం**
- **నూతన మండల అధ్యక్షులు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్**

**ఓజిలి – సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీ అధిష్టానం తనపై అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో, నిజాయితీగా నిర్వర్తించి, ఓజిలి మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఓజిలి మండలం నూతన టీడీపీ అధ్యక్షులు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్ స్పష్టం చేశారు. ఆదివారం ఓజిలిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, ప్రముఖ పారిశ్రామికవేత్త, మూడు నియోజకవర్గాల టీడీపీ రథసారథి కొండేపాటి గంగా ప్రసాద్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**శిక్షణ కోసం మంగళగిరికి బయలుదేరిన నాయకులు**

అధిష్టానం పిలుపుతో రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొననున్నట్లు వెల్లడి
పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ రోజు నుండి రెండు రోజులపాటు మంగళగిరిలో నిర్వహించే శిక్షణా కార్యక్రమానికి హాజరవుతున్నట్లు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్ తెలిపారు. మండల పార్టీ అధ్యక్ష పదవిని తనకు అప్పగించేందుకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**సేవ, సమన్వయం, సరళతకు చిరునామా**
**వివాదాలకు దూరంగా...**
**అందరినీ కలుపుకునే నాయకత్వం**

పార్టీ ఆవిర్భావం నుండి తెలుగుదేశం పార్టీకి వెన్నంటి ఉండి, అనేక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న నాయకుడిగా పాడి వెంకటసుబ్బయ్య యాదవ్‌కు మంచి పేరు ఉంది. వివాదాస్పిత రహితుడిగా, చిన్న--పెద్ద అనే తేడా లేకుండా అందరినీ కలుపుకొని పోయే స్వభావంతో మండల ప్రజల్లో ఆయనకు విశేష ఆదరణ ఉంది. తెలుగుదేశం పార్టీనే దైవంగా భావించే నిబద్ధత కలిగిన నాయకుడిగా, చీమకైనా హాని తలపెట్టని మానవీయ గుణంతో అందరివాడు అనే పేరును సంపాదించుకు న్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**బడుగు బలహీన వర్గాలకు గుర్తింపు**



**శుభపరిణామంగా అభివర్ణిస్తున్న నేతలు, కార్యకర్తలు**

ఓజిలి మండలం టీడీపీ అధ్యక్షులుగా పాడి వెంకట సుబ్బయ్య యాదవ్ నియామకంపై మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం తరువాత ఓజిలి మండలంలో బడుగు, బలహీన వర్గాలకు మండల పార్టీ అధ్యక్ష పదవి దక్కడం శుభపరిణామం అని పలువురు ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.

# సూళ్లూరుపేటలో టీడీపీ పట్టు మరింత బలపడింది

- **ఆకుతోట రమేష్ నియామకంతో రాజకీయ సమీకరణలు మారినట్టే**
- **అనుభవమే పార్టీకి అసలైన బలం**
- **మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం**



**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ తన ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటున్నదని మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆకుతోట రమేష్ నియామకం పార్టీకి గట్టి రాజకీయ బలం చేకూర్చే నిర్ణయమని ఆయన అభివర్ణించారు. ఆకుతోట రమేష్ తన అనుచరులు, పార్టీ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యాన్ని మర్యాదపూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆకుతోట రమేష్ అనుభవం, క్షేత్రస్థాయి రాజకీయాలపై పట్టుదల టీడీపీకి గట్టి పట్టు కల్పిస్తుందన్నారు. ప్రజల మధ్య నిత్యం ఉండే నాయకుడిగా ఆకుతోట రమేష్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, అలాంటి నేతకు పట్టణ పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం వల్ల కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొందన్నారు. క్రమశిక్షణ, ఐక్యతతో ముందుకు సాగితే సూళ్లూరుపేటలో టీడీపీని ఎవ్వరూ అడ్డుకోలేరని ఆయన స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో స్థానిక సమస్యలపై దూకుడుగా పోరాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత పట్టణ టీడీపీ తీసుకుంటుందని తెలిపారు. కార్యకర్తలను సమీకరిస్తూ ప్రజా ఉద్యమాల దిశగా పార్టీ అడుగులు వేస్తుందని సంకేతాలు ఇచ్చారు. ఆకుతోట రమేష్ నాయకత్వంలో సూళ్లూరుపేట పట్టణంలో తెలుగుదేశం పార్టీ రాజకీయంగా మరింత బలంగా నిలబడుతుందని, కూటమి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తుందని నెలవల సుబ్రహ్మణ్యం ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలువురు ముఖ్య నాయకులు, సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబటిపై చర్యలు తీసుకోవాలి

**- టీడీపీ కన్వీనర్ రామమునిరెడ్డి**

**- సీఎం చంద్రబాబుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**



**వేంపల్లె – సూర్య వాస్తవం:** వైసీపీ నేత అంబటి రాంబాబు వ్యాఖ్యలు సమాజానికి సిగ్గు చేటు అని, సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వేంపల్లె మండలం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ రామమునిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అంబటి రాంబాబు వ్యవహారం హద్దులు దాటిందని, సిఎం చంద్రబాబుపై అంబటి ఉపయోగించిన భాష సభ్య సమాజం తలదించుకునేలా ఉందని మండిపడ్డారు. అంబటి వాడిన భాషను ఆయన కుటుంబ సభ్యులు సమర్థిస్తారా? ఛీ కొడతారా? అనే ప్రశ్నను ప్రజలు ముందుంచారని తెలిపారు. అలాగే ఈ వ్యవహార శైలిపై ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఏ విధమైన చర్యలు తీసుకొంటారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఏ పి సిఎం చంద్రబాబుకు అంబటి రాంబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సిఎం చంద్రబాబుపై అంబటి వ్యాఖ్యలు సమాజానికి సిగ్గు చేటు అని ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, వేంపల్లె పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, సీనియర్ నాయకులు పాపిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జి మహమ్మద్, బీసీ నాయకులు రమేష్, గోగుల మల్లికార్జున, నారాయణ, చంద్ర, పయాజ్, గిరి, మదార్, జగదీష్, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తీ శ్రద్దలతో మాఘపౌర్ణమి



**వేంపల్లె – సూర్య వాస్తవం:** వేంపల్లెలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తుల సహకారంతో 30వ వార్షికోత్సవం,మాఘ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఆలయ అర్చకులు శంకరమంచి ప్రసాద్ నేతృత్వంలో ఉదయం శ్రీ షిరిడి సాయిబాబా స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, మంత్రపుష్పం, మహా మంగళ హారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తోమాల లతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు.భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.రాత్రి ఆలయం గర్భగుడి చుట్టూ పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం





**పులివెందుల– సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి ఏటా నిర్వహించే ఈ వేడుకను ఈ ఏడాది కూడా భక్తులు బ్రహ్మాండంగా నిర్వహించారు.

**భక్తుల కోలాహలం:** ఈ రథోత్సవానికి పులివెందుల పట్టణం నుండే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.ముఖ్యంగా మహిళలు, యువత భారీ సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. గోవింద నామస్మరణతో పుర వీధులు మారు మోగిపోయాయి. పట్టణంలోని ప్రధాన ఆలయం నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర వెళ్లే దారిపొడవునా భక్తులు స్వామివారికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.రథం చక్రాల కింద గుమ్మడి కాయలు కొట్టి భక్తిని చాటుకున్నారు. యాత్రలో భాగంగా వివిధ పౌరాణిక వేషధారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నరసింహ స్వామి,హనుమంతుడు, శ్రీకృష్ణుడు వంటి వేషధారణలతో కళాకారులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు,ఆలయ కమిటీ సభ్యులు మరియు వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# శివకృష్ణ గోశాలలో గరుకు స్తంభ ప్రతిష్ట

**- కార్యక్రమంలో పాల్గొన్న తులసి రెడ్డి**





**వీరపునాయుని పల్లి – సూర్య వాస్తవం:** వీరపునాయుని పల్లి మండలం సంగాలపల్లి గ్రామంలో శివకృష్ణ గో సంరక్షణ శాలలో ఆదివారం గరుకు స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీయుతులు కుమ్మితి సుబ్బ రామిరెడ్డి, కుమ్మితి శేషారెడ్డి,వనిపెంట జయరామిరెడ్డి, యాపరాల వెంకటసుబ్బారెడ్డి, ముడుమాల పిచ్చిరెడ్డి,రాజోలు సుబ్బా రెడ్డి, మూల జయరామిరెడ్డి వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గరుకుస్తంభ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ తెలుగు మాసాలలో మాఘమాసం అత్యంత పవిత్రమైనదని, మాఘ పౌర్ణమి రోజు మరింత పవిత్ర మైందన్నారు. అటువంటి పవిత్రమైన రోజున శివకృష్ణ గోశాలలో గరుకు స్తంభ ప్రతిష్ట చేయడం సంతోషదాయకం అన్నారు. గరుకు స్తంభ ప్రతిష్ట గో సంరక్షణలో ఒక భాగమని,గంగడోలు, కంటి దగ్గర,తదితర తోకకు అందని ప్రదేశాలలో గోవులకు దురద పుట్టినప్పుడు గరుకుస్తంభం ఎంతో ఉపయోగపడుతుందని,గోవులకు దురద,అలసట నుండి ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. గరుకుస్తంభ ప్రతిష్ట 100 గోదానాలతో సమానమని, పాప నివారణ కలుగుతుందని,పితృదేవతలకు స్వర్గ ప్రవేశం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయని తులసి రెడ్డి అన్నారు. ప్రాచీన కాలము నుండి గోమాతకు,భారతీయ సంస్కృతికి అవినాభావ సంబంధం ఉందని, గోమాత సేవ గోవిందుని సేవతో సమానమని తులసి రెడ్డి అన్నారు. ఆవు పాలు,పాల ఉత్పత్తులు చాలా శ్రేష్టమైనవని, 148 మానసిక, శారీరక రోగాలకు ఇవి దివ్య ఔషధాలని శాస్త్రీయంగా నిరూపించబడిందని తులసి రెడ్డి అన్నారు. గో ప్రదక్షిణం ముక్కోటి దేవతల ప్రదక్షిణముతో సమానం అన్నారు. గోవుల సంఖ్య రాను రాను తగ్గిపోతున్నదని, స్వాతంత్రం వచ్చేనాటికి దేశంలో గోవుల సంఖ్య 32 కోట్లు కాగా ప్రస్తుతం ఏడు కోట్లు మాత్రమే అన్నారు. గోసంరక్షణకు ప్రతి ఒక్కరూ పూనుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శివకృష్ణ గోశాల నిర్వాహకులు కల్లూరు రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు, ఎర్రగుంట్లకు చెందిన వేణుగోపాల స్వామి భజన బృందం వారు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాసులు, నామా వినయ్ తదితర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వికసిత భారత్ లక్ష్యంగా బడ్జెట్

**- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**



**వేంపల్లె – సూర్య వాస్తవం:** వికసిత భారత్ లక్ష్యమే బీజేపీ ధ్యేయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు వేంపల్లిలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ 3.0 పాలనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 9వసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. ఇది ఆర్థిక వృద్ధి ,ఉద్యోగ, సృష్టి, రైతుల, పేదల శ్రేయస్సు పై ప్రధాన దృష్టి పెట్టిన యువశక్తి బడ్జెట్ గా నిలుస్తుందని ఆయన అన్నారు. భవిష్యత్తు ఆర్థిక విధానాలపై స్పష్టమైన దిశను నిర్మలాసీతారామన్ తెలిపారనిఅన్నారు .నరేంద్ర మోడీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఎదగబోతోందని ఆయన అన్నారు. దేశీయ జిడిపి ఏడు శాతానికి పైగా వృద్ధిని నమోదు చేసిందని అన్నారు . సాధారణ ప్రజల శ్రేయస్సు కుదరచడం ఉద్యోగ అవకాశాలను సృష్టించడం పేపర్ రంగానికి మద్దతు ఇవ్వడం వంటి చర్యల ద్వారా ఈ అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. దేశంలో ఉత్పాదక మౌలిక సదుపాయాలు పెట్టుబడుల ఆకర్షణకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని అన్నారు. ఉద్యోగాల సృష్టి ఎం ఎస్ ఎం ఈ లను ప్రోత్సహించడం వ్యాపార సంస్కరణ ద్వారా వృద్ధికి తోడ్పాటు అందించడం జరిగిందన్నారు .ప్రభుత్వ పెట్టుబడుల ద్వారా దేశంలో వృద్ధిని ప్రోత్స హించడం జరిగిందని తెలిపారు. పి.ఎల్.ఐ పథకం 40 వేల కోట్లు వ్యయం కేటాయించడం జరిగిందని అన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో పెట్టుబడులకు 40 వేల కోట్ల సమగ్ర వ్యయం చేయనున్నట్లు ఆయన చెప్పారు. యువత, రైతులు, పేదల కోసం దీర్ఘకాలిక సంక్షేమం విద్య ఆరోగ్యం సామాజిక సేవలపై దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ లక్ష్యానికి అనుగుణంగా ఈ బడ్జెట్ ను రూపొందించడం జరిగిందని అన్నారు.ఆంధ్రప్రదేశ్ కు 2026–2027 బడ్జెట్ లో పన్నుల వాటా 64,362.16 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగిందని అన్నారు.వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు తీర ప్రాంతం నుంచి కొండల వరకు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అండగా కేంద్ర బడ్జెట్ ఉందని తెలిపారు.

## అంకురార్పణతో ఆరంభమైన శ్రీ రంగనాథుని బ్రహ్మోత్సవ వేడుకలు





**పులివెందుల– సూర్య వాస్తవం:** మధ్యరంగంగా కీర్తింపబడుతున్న పులివెందులలోని శ్రీరంగ నాథుని బ్రహ్మోత్సవ వేడుకలు ఆదివారం అంకు రార్పణతో ప్రారంభమయ్యాయి. భారత‌దేశమున ప్రాముఖ్యత వహించిన శ్రీరంగనాథుని దేవాలయాలలో మధ్యరంగంగా పేరుగాంచిన పులివెందులలో శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ చింతకుంట సుదీకర్ రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు ఇతర గౌరవ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు రాజేష్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయాస్తమాన సాంప్రదాయ పద్ధతిలో ప్రారంభ వేడుకలు నిర్వహించారు. ఈ కార్య క్రమాలలో భాగంగా శ్రీరంగనాథుడు ఉదయం సూర్యప్రభ వాహనంపై, సాయంకాల సమయాన చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం కొనసాగగా గ్రామోత్సవం కొనసాగే ఆయా పురవీధులను భక్తులు శుభ్రం చేసి రంగవల్లులతో అలంకరించి అనంతరం స్వామివారికి కాయ కర్పూరాల సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మాట్లాడుతూ తొమ్మిది రోజులు పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ రంగనాథుడు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిచ్చి చివరగా శ్రీరంగనాథుని కళ్యాణం, రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించబడునని కావున భక్తులెల్లరు ఈ కార్యక్రమాలలో పాల్గొని శ్రీ రంగనాథుని ఆశీర్వచనాలు అందుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గౌరవ సభ్యులు దినేష్ కుమార్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుపై ఆంబోతు రాంబాబు చేసిన వ్యాఖ్యలు బాధాకరం

**- టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యం**



**చెన్నూరు– సూర్య వాస్తవం:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై ఆంబోతు రాంబాబు చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరమని సభ్య సమాజంలో ఇలాంటి వ్యక్తులను, ఆబోతులను ఇలాంటి ఆంబోతులను పెంచి పోషిస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని తరిమి కొట్టకపోతే శాంతి భద్రతలకు భంగం వాటిల్లుతుందని టిడిపి బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రహ్మణ్యం అన్నారు. చెన్నూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం చేసిన అతి పెద్ద తప్పు తిరుమల దేవస్థానంలో కల్తీ నెయ్యి ఉపయోగించి పరమ పవిత్రమైన వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదాన్ని తయారు చేయడమేనని ఇది కేవలం ఆహార కల్తీ మాత్రమే కాదని కోట్లాది భక్తుల విశ్వాసంపై చేసినదాడిగాఆయనఅభివర్ణించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు హిందూ దేవుళ్ళు అంటే నమ్మకం లేదని వాళ్ల పార్టీ అధినాయకుడే హిందూ సంప్రదా యాలను గౌరవించే వ్యక్తి కాదని అలాంటప్పుడు ఇలాంటి చండాలపు పనులు చేయడం, దుర్మార్గంగా గంగ ఎలా పడితే అలా మాట్లాడడం వారికి అలవాటేనని అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు విషయంలో మేము స్పష్టంగా చెబుతున్నాం. ఎవరు ఏ పార్టీ వాళ్ళైనా సరే ఎంత పెద్ద వాళ్ళైనా సరే దోషులను వదిలిపెట్టకూడదు రాజకీయాలు పక్కన పెట్టాలి నిజం బయటకు తేవాలి అనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలియజేశారు. ఈ విషయమై న్యాయపరమైనటువంటి విచారణ వేసి కల్తీ నెయ్యి వ్యవహారం ఎక్కడ మెడకు చుట్టుకుంటుందో అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులులి లిఅసభ్య పదజాలంతో మా నాయకుడు నారా చంద్రబాబు ను తిడుతూ, రాక్షస ఆనందం పొందుతున్నారు. దేశం గర్వించదగ్గ నాయకుడు చంద్రబాబు నాయుడు ఆయన విజన్ కలిగిన వ్యక్తి అలాంటి నాయకుని పై అవాకులు చవాకులు వాగితే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# మహాశివరాత్రి మహోత్సవానికి తులసి రెడ్డిని ఆహ్వానించిన అర్చకులు



**వేంపల్లె – సూర్య వాస్తవం:** కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం, ముద్దనూరు మండలం, బొందల కుంట గ్రామంలో అతి ప్రాచీనమైన శ్రీ బసవేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఫిబ్రవరి 15వ తేదీన జరుగు మహాశివరాత్రి మహోత్సవానికి రావలసిందిగా రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డిని ఆదివారం వేంపల్లిలో ఆలయ అర్చకులు బి.అనిల్ కుమార్, భక్తులు ముని కిరణ్, ఉదయ్ కిరణ్, ఓబులేసు, గౌతమ్, పవన్ ఆహ్వానించారు. తప్పకుండా పాల్గొంటారని తులసి రెడ్డి చెప్పారు.

# భక్తిశ్రద్ధలతో మాఘ పౌర్ణమి పూజలు

### - మొక్కలు పంపిణీ చేసిన ఆలయ కమిటీ సభ్యులు







**పామిడి –సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలోని శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రంలో మాఘ పౌర్ణిమ సందర్భంగా శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పూజ్య సద్గురు దేవుల దివ్య అనుగ్రహంతో ఆదివారం జరిగాయి. సత్యనారాయణ స్వామి వ్రతం ప్రారంభమై, అనంతరం మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరిపారు. వందలాది మంది భక్తులు ఈ వ్రతంలో పాల్గొని శ్రీ దత్తప్రభు అనుగ్రహాన్ని పొందారు. అన్నదాన సేవాకర్తలుగా, పుల్ల ఈశ్వరయ్య, ఖమిత్కర్ వెంకటేశ్వర రావు, అరుణబాయ్, కేదార్నాథ్ రావు,సంగీతా భాయ్ దొడ్డి సుదర్శన్ కుమార్, షాను దంపతులు కలిసి సేవలందించారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఎం.హెచ్. లక్ష్మీ నారాయణ రెడ్డి, సమితి సభ్యులు శ్రీరాములు, భార్గవ్, వెంకటరాముడు, నారాయణ స్వామి, ఆర్.ఎస్.ఎస్. శ్రీనివాసులు, తదితరులు విచ్చేసిన భక్తులకు "ఒక మనిషికి,ఒక మొక్క" కార్యక్రమంలో భాగంగా మొక్కలను అందజేసి, వాటిని తమ ఇళ్లలో లేదా స్వస్థలాల్లో నాటాలని, ప్రకృతి సమతుల్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు.

# వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

### - జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, వైవిఆర్, చెన్నకేశవరెడ్డి, వైసీపీ నాయకులు






**పామిడి –సూర్య వాస్తవం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంతకల్ మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి పార్టీ గ్రామ- వార్డు స్థాయి కమిటీలను సంస్థాగత నిర్మాణ కార్యక్రమం గుంతకల్ పట్టణం బీరప్ప సర్కిల్ గుంతకల్లుప్ప కళ్యాణమండపం నందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంతకల్ మాజీ శాసనసభ్యులు వై. వెంకటరామిరెడ్డి అధ్యక్షతన కార్యక్రమ సమావేశం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా వైయస్సార్ సీపీ అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ప్రొద్దుటూరు మాజీ శాసనసభ్యులు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ,తాడపత్రి మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి,శింగణమల నియోజ కవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ , పార్లమెంట్ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి,గుంతకల్ నియోజకవర్గం పరిశీలకులు బోయ తిప్పేస్వామి,గుంతకల్ మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతి రెడ్డి ,జిల్లా వైస్సార్సీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నకేశవ రెడ్డి వారు మాట్లాడుతూ జరగబోయే ఎలక్షన్లలో వైఎస్ఆర్సిపి పార్టీని గెలిపించుకునేలా అందరం సమన్వయంగా పనిచేద్దామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# దివ్యాంగులను తీర్చిదిద్దేలా కుదిరిన ఒప్పందం



**అనంతపురం –సూర్య వాస్తవం:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు విజన్ "వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రేన్యూర్" ను అమలు చేయడమే లక్ష్యంగా, గుర్తింపు ఫౌండేషన్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనంతపురం జిల్లా కలిసి దివ్యాంగులను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దడానికి ఆదివారం ఒప్పంద పత్రం కుదుర్చుకున్నారు. 'గుర్తింపు ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఏర్పడిన మొట్ట మొదటి ఇంకుబేటర్ డీఈ హబ్ ద్వారా ఇప్పటికే పలు శిక్షణ కార్యక్రమాల నిర్వహించి 500 మందికిపైగా దివ్యాంగులకు ఉపాధి, 75 మందికి పైగా వ్యాపార అవకాశాలు కల్పించామని గుర్తింపు ఫౌండేషన్ ఫౌండర్ కొప్పుల వసుంధర తెలిపారు. గుర్తింపు ఫౌండేషన్ డీఈ హబ్ తో కలిసి ఇన్క్లూసివ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ లో భాగంగా సమాజంలోని ప్రతి వర్గానికి, ముఖ్యంగా దివ్యాంగులు, అణగారిన వర్గాలు వ్యాపారం ప్రారంభించేందుకు సమాన అవకాశాలు, శిక్షణ, ఆర్థిక సహాయం, మార్కెట్ యాక్సెస్ ఇవ్వడానికి ఇగ్నైట్ 2.0ను మార్చి నెలలో ప్రార్మభించనున్నట్లు ఆమె వెల్లడించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్" విజన్ ఆర్.టీ.ఐ.హెచ్ లోనే మొదట అమలు చేస్తున్నమని పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ ఒప్పందం చేసుకున్నామని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ డా.హఫీజ్ భాషా తెలిపారు. స్థానిక ఎస్కేయూ అటల్ ఇంకుబెషన్ సెంటర్ సీఈఓ చంద్ర మౌళి కూడా గుర్తింపు ఫౌండేషన్ వారితో భాగస్వామ్యం అవుతున్నట్టు దివ్యాంగుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలతో ఈ శిక్షణ రెండు వారాల పాటు స్థానిక జేఎన్టీయూ యూనివర్సిటీలో నిర్వహిస్తామని, ఆసక్తి గల దివ్యాంగులు సెల్: 7729932987, 91003 32660 నంబర్లలో సంప్రదించాలని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఎగ్జిక్యూటివ్ ప్రతినిధి సమీరా తెలిపారు.

# ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం అనిల్ సింఘాల్ బదిలీ

**- ధర్మ సంరక్షణ చేయడం అనిల్ సింఘాల్ చేసిన నేరమా..?**
**- వైసీపీ ఎస్ఈసి సభ్యుడు సత్య సాయినాథ్ శర్మ ఎద్దేవా**



**కమలాపురం–సూర్య వాస్తవం:**

కల్తీనెయ్యి ఆరోపణలో సిట్ అధికార యంత్రాంగానికి వాస్తవికత నిజా నిజాలకు సహకరించి ధర్మ సంరక్షణ ను కాపాడిన టీటీడీ కార్య నిర్వాహణాధికారి అనిల్ సింఘాల్ ఆకస్మిక బదిలీ రాష్ట్ర ప్రభుత్వ అసమర్ధకు నిదర్శనమని వైసిపి రాష్ట్ర ఎస్ఈసి సభ్యుడు కాశీబట్ల సత్య సాయినాథ్ శర్మ ఎద్దేవా చేసారు. కమలా పురంలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు .పవిత్రమన తిరుమలలో కల్తీ నెయ్యి ఆరోపణలలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సి.బి.ఐ సిట్ పూర్తి వాస్తవికతను బయటపెట్టిన విష యాన్ని జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం తమ అసమర్థతను చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి అధికారులను బలి పశువులను చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమలలో లడ్డు తయారీకి వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలపలేదని సిట్ అధికారులు కోర్టుకు సమర్పించిన నివేదికతో జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వ పాలకులు తమ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోతోందని సమర్ధుడైన అనిల్ సింఘాల్ ను బదిలీ చేయడం గమనిస్తే కేవలం వైసీపీ,మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మీద బురద చల్లడానికి, రచించిన ప్రణాళిక లాగా అర్థమవుతోందని దుయ్యబట్టారు.గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న 2014 నుంచి 2019 వరకు టీటీడీ ఈవోగా అనిల్ సింఘాల్ చేసిన సేవలకు మెచ్చుకొని మరలా అధికారంలోకి వచ్చాక ఆయననే టీటీడీ ఈవోగా నియమించుకున్న విషయం అధికార పార్టీ మర్చిపోయినట్లు ఉందన్నారు. కల్తీ నెయ్యి ఆరోపణలలో కూటమి ప్రభుత్వ అసమర్థ నియమాలకు అనిల్ సింఘాల్ సహకరించలేదన్న దురుద్దేశంతో బదిలీ చేయడం కూటమి పాలకుల చేతకానితన మన్నారు. అనిల్ సింఘాల్ బదిలీతో రాష్ట్ర ప్రభుత్వం కల్తీ నెయ్యి ఆరోపణలలో తప్పు చేసినట్లు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై అనవసరంగా నిందలు వేసినట్లు ఒప్పుకున్నట్లేనన్నారు.

ఈ విషయంలో ఇప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు చైతన్యవంతులై కూటమి ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. ఇప్పటికైనా కోటను ప్రభుత్వ పాలకులు దేవుని విషయంలో రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు

# గంజాయి కేసులో కీలక నిందితుడి అరెస్ట్

### - పోలీసుల చాకచక్యం



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు, జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపు తున్నారు. ఈ క్రమంలో మదనపల్లె డిఎస్పీ ఎస్.మహేంద్ర పర్యవేక్షణలో, మొలకల చెరువు సర్కిల్ ఇన్స్పెక్టర్ సి. వెంకటేసులు, పి.టి.యం. ఎస్ఐ బి. పరమేష్ నాయక్ బృందం శనివారం ఉదయం నిందితుడిని అరెస్ట్ చేశారు. శనివారం ఉదయం 9:30 గంటల సమయంలో మొలకల చెరువు రైల్వే స్టేషన్ సమీపంలోని చింత చెట్టు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా అతని వద్ద దాదాపు 2 కేజీల ఎండు గంజాయి లభించింది. నిందితుడిని అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలానికి చెందిన కొర్ర అర్జున్ (35) గా గుర్తించారు. 2024 జనవరిలో మదనపల్లెకు చెందిన ఓబులేసు (అలియాస్ శాంసంగ్) అనే వ్యక్తి నిందితుడు అర్జున్ వద్దకు వెళ్లి 110 కేజీల గంజాయి కోసం ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీని కోసం ఓబులేసు లక్ష రూపాయల అడ్వాన్స్ కూడా చెల్లించాడు. ఒప్పందం ప్రకారం నిందితుడు 110 కేజీల గంజాయిని అప్పగించగా, మిగిలిన సొమ్మును తర్వాత అకౌంట్‌లో వేస్తానని ఓబులేసు నమ్మబలికాడు.అయితే ఓబులేసు నుండి రావాల్సిన మిగిలిన డబ్బుల కోసం వేచి చూస్తున్న క్రమంలో, ఈరోజు మొలకలచెరువు సమీపంలో పోలీసులకు దొరికిపోయాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. "జిల్లాలో గంజాయి విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుంది." అని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు.

# అంబటి రాంబాబు నోరు జాగ్రత్తగా పెట్టుకో నాలుక చీరేస్తాం

### - అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దగ్ధం చేసిన టిడిపి నాయకులు
### - నారా కుటుంబ సభ్యులకు అంబటి క్షమాపణ చెప్పాలి
### - టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ తూగుట్ల మధు



**పులివెందుల –సూర్య వాస్తవం:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు పై అర్థరహితమైన వ్యాఖ్యలు చేసిన వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు అసభ్య పదజాలంతో దూషించడం సబబు కాదని వెంటనే ఆయన బహిరంగంగా నారా కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాలని, లేదంటే నాలుక చీరేస్తామని తెదేపా రాష్ట్ర కార్యదర్శి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పులివెందుల పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో అంబంటి రాంబాబు దిష్టిబొమ్మను తెదేపా నాయకులు దగ్ధం చేశారు. రాంబాబు డౌన్ డౌన్ అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సంద ర్భంగా మధు మాట్లాడుతూ రాంబాబు లాంటి నాయకులు సమాజంలో తిరగనివ్వ కుండా ప్రజలందరూ ఎదురు తిరగాలని ఆయన అన్నారు. ఇలాంటి బాష మాట్లాడు తుండడంతోనే వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడ రాలేదని అన్నారు. సభ్య సమాజం తల దించుకొనేలాగా వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రాంబాబు నోరు అదుపులో పెట్టుకోకపోతే చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, మగ్గం ప్రసాదు, సుబ్బారెడ్డి, హరినాథ్రెడ్డి, అంకల్ రెడ్డి, బాబా ఫక్రుద్దీన్, రియాజ్, మనోహర్, వల్లెపు శివవరాం, ఫయాజ్, గణేష్, దేవకుమార్, గండి, సుబ్బరాయుడు, చంటి, రాజ్ కుమార్,ఏబు, ప్రశాంత్, అక్రమ్ , మంజుల , శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా మాఘ పౌర్ణమి వేడుకలు

### - భక్తిశ్రద్ధలతో అభిషేకాలు హోమాలు

**పులివెందుల– సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణ పరిధిలోని రిషి స్కూల్ ఎదురుగా ఉన్నటువంటి శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం మాఘ పౌర్ణమి పురస్కరించు కొని శిరిడి సాయినాథునికి అభిషేకాలు హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయాస్తమాన గణపతి పూజ కాగడ హారతి అనంతరం 108 బిందెల పాలాభిషేకం శాస్త్రృత్తంగా వేద పండితులచే గణపతి నవగ్రహ సుదర్శన హోమాలను ఉభయ దారులచే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాఘ మాసంలో శిరిడి సాయినాథునికి పాలాభిషేకాలు హోమాలు అత్యంత శోభాయ మానంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పూజా కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమార్ శ్వేత, బలిజ సంఘం ప్రెసిడెంట్ గూడూరు ప్రసాద్, సర్వేశ్వర్, సాకే నరేష్, మదన్మోహన్ రెడ్డి, నిరుపమ, మాబ్జాన్, శ్రీనివాసులు, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.





# నాగుల కట్ట వద్ద అన్నదానం



**పులివెందుల –సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణం బ్రాహ్మణపల్లి రోడ్డు సమీపంలో ఉన్న నాగలకట్టు వద్ద ఆదివారం బలిజ సంఘం నాయకుడు కొంగనపల్లి మురళి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ప్రతి ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అదేవిధంగానే ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంగనపల్లి కొండలరావు, వారి కుటుంబ సభ్యులు, వైకాపా పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అంబటి వ్యాఖ్యలతో రగిలిన నాయుడుపేట

- అంబటి రాంబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- డా. నెలవల విజయశ్రీ, ఎమ్మెల్యే
- సీఎం చంద్రబాబుపై దుర్భాషలకు కూటమి ఘాటు సమాధానం
- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రోడ్డెక్కిన ప్రజలు
- మానవహారం... దిష్టిబొమ్మ దగ్ధం... అంబటిపై చర్యలు డిమాండ్



**నాయుడుపేట - సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా నాయుడుపేటలో వైసీపీ నేత అంబటి రాంబాబు వ్యాఖ్యలతో రాజకీయ ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును దూషించిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కూటమి పార్టీలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి ప్రజాగ్రహాన్ని వ్యక్తం చేశాయి. వైసీపీ నేత అంబటి రాంబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై చేసిన అనుచిత, దుర్భాషల వ్యాఖ్యలను ఖండిస్తూ నెల్లూరు--తిరుపతి ఉమ్మడి జిల్లా నాయుడుపేటలో కూటమి పార్టీలు శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని పోలేరమ్మ ఆలయం వద్ద ప్రారంభమైన నిరసన ర్యాలీ పోలీస్ స్టేషన్, దర్గా రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా సాగి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా కూటమి పార్టీ నాయకులు మానవహారం ఏర్పాటు చేసి అంబటి రాంబాబు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఘాటైన నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట అంబటి రాంబాబు దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి దహనం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ, గత నలభై ఏళ్లుగా నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు. అంబటి రాంబాబు లాంటి వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమని, వెంటనే ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు నిత్యం అశ్లీల, అసభ్య పదజాలంతో మాట్లాడుతూ రాష్ట్రంలో అల్లర్లు, గొడవలకు కారణమవుతున్నారని కూటమి నేతలు ఆరోపించారు. తిరుమల పవిత్ర లడ్డు తయారీలో నెయ్యి కల్తీ జరిగిందన్న అంశాన్ని సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఆ విషయాన్ని పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై దుర్భాషలకు దిగుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పినప్పటికీ, వారి వైఖరిలో ఎలాంటి మార్పు రావడం లేదని కూటమి నేతలు విమర్శించారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్న వైసీపీ నాయకుల తీరు కొనసాగితే రానున్న ఎన్నికల్లో వైసీపీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని హెచ్చరించారు. తెలుగు ప్రజల గౌరవాన్ని కాపాడేందుకు ఇటువంటి వ్యాఖ్యలను సహించబోమని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ కుమార్, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గోను బాబు, పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, సీనియర్ నాయకులు పార్థసారథి, కట్టా వెంకట రమణారెడ్డి, నెలవల రాజేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం, జనసేన పార్టీ నాయకులు అట్ల కృష్ణారావు, తెలుగు మహిళా నాయకులు చెందేటి సుజాత, చిట్టేటి రేవతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు, కార్యకర్తలు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు.







# పేదల అభ్యుదయమే సీఎం చంద్రబాబు లక్ష్యం

- ప్రతి ఇంటా సంతోషం, ప్రతి కంటా ఆనందం
- కందుకూరులో పింఛన్ల పంపిణీలో ఎంపీ వేమిరెడ్డి, మంత్రి ఆనం, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

**నెల్లూరు - సూర్య వాస్తవం :**

పేదల అభ్యుదయమే లక్ష్యం గా సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు.





కందుకూరు నియోజకవర్గ కేంద్రం లోని 4, 32 వార్డులో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజబాబు, సబ్ కలెక్టర్ హిమ వంశీ, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర తో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఒకటవ తేదీ కంటే ముందే అర్హులకు పింఛన్లు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందని ఆయన అన్నారు. ఎంతోమంది వృద్ధులు, నిరు పేదలు దివ్యాంగుల ఇంట పండుగ వాతావరణం నెలకొందని చెప్పారు. సంక్షేమం, అభి వృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం పై ప్రజల ఆశీస్సులు ఇలాగే కొనసాగాలని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, అధికారులు, టిడిపి నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మదరసా - ఏ - మదీనాతూల్ ఉలూమ్ ప్రారంభం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న కె.యం. షకీల్ షఫీ, డాన్ సాదిక్




**అనంతపురం - సూర్య వాస్తవం:**

అనంతపురం పట్టణంలోని స్థానిక ఎర్రనేల కొట్టాల (యం.జి కాలనీ)లో మదీనా మస్జీద్ పై భాగం లోని మదరసా - ఏ - మదీనాతూల్ ఉలూమ్ ను ఆదివారం నాడు ఘనంగా ప్రారంభం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు అల్హాజ్ కె.యం. షకీల్ షఫీ పాల్గొని జమాత్ వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మస్జిద్ ముతవల్లి మహమ్మద్, డాన్ సాదిక్, ఐ ఎం ఎం మహబూబ్ బాషా, ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతల మర్యాదపూర్వక భేటీ

- పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి



**గుత్తి- సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో ఆదివారం వైసీపీ నేతల మధ్య మర్యాద పూర్వక భేటీ జరిగింది. గుత్తి పట్టణ కన్వీనర్ కప్పలబండ మధుసూదన్ రెడ్డి నివాసంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిని పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి సి.వి.రంగారెడ్డి, జిల్లా నాయకులు హరి జిరాక్స్ అ ధినేత రామసుబ్బారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ వి.వరదరాజులు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ కటిక మూన్నవార్ (మున్నా), గుత్తి పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు హేమలత రెడ్డి,మున్సి పల్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, జిల్లా యూత్ కార్యదర్శి కు మ్మేత రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే టౌన్ ప్రచార కమిటీ అధ్యక్షు డు అబ్దుల్ రవుఫ్, గుత్తి మండల బీసీ అధ్యక్షుడు బిందే సురేష్, గోపి రెడ్డి, మండల యూత్ కార్యదర్శి బాచుపల్లి గాంధీ, గుత్తి టౌన్ పంచాయతీ వింగ్ అధ్యక్షుడు జిప్ రవి, స్టూ డెంట్ వింగ్ అధ్యక్షుడు ఇమ్రాన్, బోయగడ్డ రాము, మధు, గోవర్ధన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం ఈ కార్యక్రమానికి వైసీపీ నాయకులు పాల్గన్నారు.

# నేటి నుండి ప్రిన్సిపాళ్లు, వార్డెన్లకు శిక్షణ

- సత్యసాయి జిల్లా జిసిడివో అనిత



**శ్రీ సత్యసాయి బ్యూరో - సూర్య వాస్తవం :** నేటి నుంచి ఈనెల 6వ తేదీ వరకు సత్యసాయి జిల్లాలోని 30 మంది కేజీబీవీ ప్రిన్సిపాల్స్, 12 మంది వార్డెన్లకు 5 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా జిసిడిఓ అనిత తెలిపారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ కేజీబీవీల్లో విద్యనభ్యసిస్తున్న అణగారిన కులాల విద్యార్థినుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు,పాఠశాల విద్య,అక్షరాస్యత విభాగం, జాతీయ విద్యా ప్రణాళిక, పరిపాలన సంస్థ సంయుక్త సహకారంతో కేజీబీవీ టైప్-3,4 ప్రిన్సిపల్స్,వార్డెన్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో జాబ్ రోల్స్, అడ్మిన్ట్రేషన్, సమస్యల పరిష్కారం, అక్టివిటీ బేస్డ్ శిక్షణ, ఎనలైజర్, గ్రూప్ అక్టివిటి, మిషన్లైఫ్ అక్టివిటి వాటితోపాటు బిల్లింగ్, ఐసీటీ ఫైనాన్సియల్ మెనేజ్మెంట్పై ఫండ్స్ ఎలా వినియోగించాలి, బిల్ ఏ విధంగా తయారు చేయాలనే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. అనంతపురం జిల్లాలోని బుక్కరాయసముద్రం వద్ద గల విజయభారతి బిఈడి కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్లు, రిసోర్స్ పర్సన్లు పల్నాడు జిల్లా జిసిడివో రేవతి, రాయచోటి డైట్ లెక్చరర్ ఉష మాధురి, బుక్కపట్నం డైట్ లెక్చరర్ రాధిక, మాలతి తదితరులు హాజరై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

# వైసీపీ నేత అంబటి రాంబాబు వ్యాఖ్యలు శోచనీయం

- టీడీపీ సీనియర్ నాయకుడు, నాయిని చెరువు చైర్మన్ కూనపూరి రాములు



**వేముల- సూర్య వాస్తవం :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైఎస్ ఆర్సిపి సీనియర్ నాయకుడు అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు రాజకీయ హద్దులు దాటి, నైతిక విలువలు చంపేసిన దుర్మార్గపు వ్యాఖ్యలు మాటలని టిడిపి సీనియర్ నాయకుడు,నాయిని చెరువు చైర్మన్ కూనపూరి రాములు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆయన నివాసంలో మాట్లాడుతూ అంబటి రాంబాబు చేసింది ఇది రాజకీయ విమర్శ కాదనీ ఇది ఒక రాజ్యాంగబద్ధ పదవిపై చేసిన అవమానమని ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని ఈ స్థాయిలో దిగజారిన భాష మాట్లాడటం అంబటి రాంబాబు రాజకీయ అహంకారానికి పరాకాష్టనీ అన్నారు.ఒక మాజీ ప్రజాప్రతినిధిగా ఉండి కూడా సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడటం ఆయన అర్హతలేమిని, సంస్కారహీన రాజకీయాలను బయటపెడుతోందనీ ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లో విషాన్ని నింపుతాయని వ్యవస్థలపై గౌరవాన్ని దెబ్బతీస్తాయని ఇప్పటికైనా ప్రభుత్వం ఈ దుర్మార్గపు వ్యాఖ్యలతో సరైన సమాధానం చెప్పాలని సూచించారు. అందుకే మేము స్పష్టంగా డిమాండ్ చేస్తున్నామని అంబటి రాంబాబును వెంటనే అరెస్టు చేసి చట్టం ముందు నిలబెట్టి కఠిన చర్యలు తీసుకోవాలనీ పోలీసు వ్యవస్థను కోరారు. తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్య గౌరవం కోసం,రాష్ట్ర ప్రతిష్ట కోసం పోరాటం చేయాల్సి వస్తే వెనకడుగు వేయదనీ ఇది వ్యక్తిగత విషయం కాదని ఇది రాష్ట్ర గౌరవానికి సంబంధించిన విషయమని ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇలాంటి అరాచక శక్తులను కచ్చితంగా శిక్షించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.




# రామ్‌చరణ్-ఉపాసన దంపతులకు కవలలు జన్మించారు : చిరంజీవి

హైదరాబాద్ : మెగా కుటుంబంలో సందడి. సినీ నటుడు రామ్ చరణ్, ఉపాసన దంపతులకు కవల పిల్లలు జన్మించారు. ఉపాసన ఓ మగ, ఆడ శిశువులకు జన్మనిచ్చినట్లు మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా ఏర్పాటు చేశారు. తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని, తమ కుటుంబంలోకి కొత్త సభ్యులు రావడం సంతోషం కలిగిస్తోందని చెప్పారు. ఇప్పటికే రామ్ చరణ్ దంపతులకు కుమార్తె క్లింకార ఉన్న సంగతి తెలిసిందే. ఈ వార్తతో మెగా అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.

" రామ్‌చరణ్ జన్మించిన-ఉపాసన దంపతులకు శనివారం రాత్రి కవలలు. దీంతో కొణిదెల, కామినేని కుటుంబాలు సంతోషంగా ఉన్నాయి. ఆ భగవంతుడి దయ, హనుమాన్ కృపతో ఒక మగబిడ్డ, ఒక ఆడబిడ్డ జన్మించారు. ఉపాసనతో పాటు బిడ్డలిద్దరూ చాలా ఆరోగ్యంగా ఉన్నారు.

మా ఇంట శుభం కలగాలని ఎక్కడెక్కడి నుంచో కోరుకున్నారు. ఈ వార్తను మీతో పంచుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అభిమానులు దీన్ని పండుగలా ప్రకటించారు. వారి ఆనందానికి అవధుల్లేవు. అందరికీ ధన్యవాదాలు " అని చిరంజీవి అన్నారు.

# అందరి కథే 'విత్ లవ్' : రానా దగ్గుబాటి






'విత్‌లవ్' మూవీ ట్రైలర్ బాగుంది. ఇది మన కథే అనిపిస్తోంది. ట్రైలర్ చూసిన వారందరూ చాలా కనెక్ట్ అయ్యారు. అందరూ కనెక్ట్ అయ్యే ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్ ఇది. సౌందర్య గారు తెలుగులో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. యూనిట్‌కి ఆల్ ది బెస్ట్' అని కథానాయకుడు రానా దగ్గుబాటి చెప్పారు. మహేష్‌రాజ్, అనస్వరా రాజన్, రానా, సౌందర్య, అభిషన్ జీవింత్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళచిత్రం 'విత్‌లవ్'. మదన్ రచన, దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని సౌందర్య రజనీకాంత్?తో కలిసి ఎంఆర్‌పి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నజరత్ పసిలియన్, మహేష్‌రాజ్ పసిలియన్ సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న విడుదల కానుంది. తెలుగులో సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ విడుదల చేస్తోంది. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సౌందర్య రజనీకాంత్ మాట్లాడారు. 'నా చిన్నప్పటి ఫ్రెండ్ రానా. తనతో నాకు ఎన్నో బాల్య జ్ఞాపకాలున్నాయి. 'విత్ లవ్'ని తను రిలీజ్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాని అందరూ థియేటర్లలో చూడాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. 'మా 'టూరిస్ట్ ఫ్యామిలీ'కి మీరందరూ గొప్ప ఆదరణ ఇచ్చారు. 'విత్‌లవ్' కూడా అద్భుతమైన భావోద్వేగాలున్న సినిమా. మన జ్ఞాపకాలని నెమరువేసుకునేలా ఉంటుంది" అన్నారు అభిషన్ జీవింత్. 'విత్ లవ్' క్యూట్ సినిమా. చాలా ప్రేమతో ఈ చిత్రం చేశాం. తప్పకుండా అందర్నీ అలరిస్తుంది' అని పేర్కొన్నారు అనస్వరా రాజన్. మహేష్‌రాజ్ మాట్లాడుతూ 'టూరిస్ట్ ఫ్యామిలీ'లానే ఈ సినిమాని కూడా ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.



# ఇషాన్ కిషన్ సెంచరీ



- సూర్యకుమార్ యాదవ్ అర్ధసెంచరీ
- చివరి టి20లో న్యూజిలాండ్ ఓటమి
- సిరీస్ 4-1తో టీమిండియా కైవసం

తిరువనంతపురం: ఐదో టి20లోనూ టీమిండియా ఘన విజయం సాధించింది. తిరువనంతపురం వేదికగా జరిగిన చివరి టి20లో భారతజట్టు 46 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 271పరుగుల భారీస్కోర్ చేసింది. ఈ ఫార్మాట్‌లో టీమిండియాకు ఇదే అత్యధిక స్కోర్ కాగా.. ఓవరాల్‌గా ఈ ఫార్మాట్‌లో మూడో అత్యధిక స్కోర్ నమోదు చేసింది. 272 పరుగుల భారీ లక్ష్యంగాతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు పవర్-ప్లే 6ఓవర్లలోనే 79పరుగులు చేసి ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభిం చింది. ఫిన్ అలెన్(80), రచిన్ రవీంద్ర(30), ఇష్ సోఢీ(33) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఆర్ష్‌దీప్ సింగ్(5/51) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో పాటు అక్షర్ పటేల్(3/33) మెరిసారు. దీంతో న్యూజిలాం డ్ 19.4ఓవర్లలో 225పరుగులకు ఆలౌటైంది. దీంతో ఐదు టి20ల సిరీస్‌ను భారత్ 4-1తో చేజిక్కించుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ ఇషాన్, సిరీస్ సూర్యకుమార్ యాదవ్‌కు దక్కాయి.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఈ సిరీస్‌లో పేలవ ఫామ్‌తో నిరాశపరుస్తున్న సంజు శాంసన్(6) మరోసారి స్వల్పస్కోర్‌కే పెవీలియన్‌కు చేరాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీ, సూర్య కుమార్ యాదవ్ మెరుపు ఇన్నింగ్స్‌తోపాటు భారత బ్యాటర్లు రాణించడంతో ఇండియా భారీ స్కోరు నమోదు చేసింది. 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి, 271 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ 16 బంతుల్లోనే 30 పరుగులు చేయగా.. ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 43 బంతుల్లోనే 4 ఫోర్లు, 10 సిక్సర్లతో 103 పరుగులు చేశాడు. అతడి స్ట్రైక్ రేటు 239. హార్ధిక్ పాండ్యా 17 బంతుల్లో ఒక ఫోర్, 4 సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. తర్వాత వచ్చిన రింకూ సింగ్ 8 బంతుల్లో 8 పరుగులు, శివం దూబే 2 బంతుల్లో 7 పరుగులు చేయడంతో ఇండియా 271 పరుగులు చేసింది. న్యూజిలాండ్ బౌలర్లలో ఫెర్గుసన్‌కు రెండు, సాంట్నర్, జేమీసన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

**స్కోర్‌బోర్డు...**

ఇండియా ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (బి)ఫెర్గుసన్ 30, సంజు శాంసన్ (సి)జాకోబ్స్ (బి)ఫెర్గుసన్ 6, ఇషాన్ కిషన్ (సి)ఫిలిప్స్ (బి)డఫీ 103, సూర్యకుమార్ యాదవ్ (సి)సెఫెర్ట్ (బి)సాంట్నర్ 63, హార్దిక్ పాండ్యా (సి)జాకోబ్స్ (బి)జేమీసన్ 42, రింకు సింగ్ (నాటౌట్) 8, దూబే (నాటౌట్) 7, అదనం 12. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 271పరుగులు. వికెట్ల పతనం: 1/31, 2/48, 3/185, 4/233, 5/261 బౌలింగ్: డఫీ 4-0-53-1, జేమీసన్ 4-0-59-1, ఫెర్గుసన్ 4-0-41-2, ఇష్ సోఢీ 3-0-48-0, ఫిలిప్స్ 1-0-10-0, సాంట్నర్ 4-0-60-1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సెఫెర్ట్ (సి)హార్దిక్ (బి)ఆర్ష్‌దీప్ 5, అలెన్ (సి)రింకు సింగ్ (బి)అక్షర్ 80, రచిన్ రవీంద్ర (సి)అక్షర్ పటేల్ (బి)ఆర్ష్‌దీప్ 30, ఫిలిప్స్ (సి)రింకు సింగ్ (బి)అక్షర్ 7, మిఛెల్ (బి)ఆర్ష్‌దీప్ 26, సాంట్నర్ (సి)సూర్యకుమార్ (బి)ఆర్ష్‌దీప్ 0, జాకోబ్స్ (బి)వరుణ్ చక్రవర్తి 7, జేమీసన్ (బి)ఆర్షఈప్ 9, ఇష్ సోఢీ (సి)ఆర్ష్‌దీప్ (బి)రింకు సింగ్ 33, ఫెర్గుసన్ (బి)అక్షర్ 3, డఫీ (నాటౌట్) 9, అదనం 16. (19.4ఓవర్లలో ఆలౌట్) 225పరుగులు. వికెట్ల పతనం: 1/17, 2/117, 3/131, 4/137, 5/137, 6/166, 7/179, 8/180, 9/191, 10/225 బౌలింగ్: ఆర్ష్‌దీప్ 4-0-51-5, హార్దిక్ పాండ్యా 2-0-15-0, బుమ్రా 4-0-58-0, వరుణ్ 4-0-36-1, అక్షర్ పటేల్ 4-0-33-3, అభిషేక్ శర్మ 1-0-13-0, రింకు సింగ్ 0.4-0-7-1.

# ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం

- రాబోయే అంధకారాన్ని పసిగట్టిన కాంగ్రెస్
- షర్మిలమ్మ రాక కార్యక్రమాన్ని జయప్రదం చేస్తాం
- పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ : గౌని ప్రతాపరెడ్డి




**రాయదుర్గం - సూర్య వాస్తవం :** కేంద్ర ప్రభుత్వం వారి స్వలాభం కోసం పేదల కూలి పనుల కోసం ఎన్నో ఏళ్లగా ఉపాధి హామీ పథకాన్ని, పేద ప్రజల మనోభావాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తుందని, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టడానికి, యావత్ ప్రపంచం అంధకారం మాయను కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగానే పసికట్టిందని గౌని ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ... మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పరివేక్షణకై ఫిబ్రవరి రెండవ తారీకు బండ్లపల్లి గ్రామం సింగనమల నియోజకవర్గంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల పర్యటిస్తారని, మూడవ తేదీ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పర్యటిస్తారని రాష్ట్ర అధ్యక్షరాలు పర్యటనకు పార్టీలకు అతీతంగా పాల్గొని అధ్యక్షురాలు షర్మిల ర్యాలీని జయప్రదం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రజలకు కాంగ్రెస్ అధ్యక్షులు ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. గత 20 సంవత్సరాల క్రితం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కరువు కాటాలకు ఇతరత్రా సమస్యల వల్ల వలస బాట పట్టిన పేద ప్రజలకు తోడుగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తూట్లు పొడుస్తూ, మహాత్మా గాంధీ పేరును తొలగించడమే కాకుండా కనీసం వంద రోజులు పని చేసిన హక్కులను కూడా కాలరాస్తూ చట్టం ముఖ్య ఉద్దేశాలను, విజిబి రామ్ జి పథకాన్ని ప్రవేశపెట్టాలన్న కేంద్ర ప్రభుత్వం దురాలోచనను వెంటనే ఉపసం హరించుకోని, యధాతథంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కొనసాగింపు చేయాలని గౌని ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం యధాతథంగా నిర్వహించకపోతే కేంద్ర ప్రభుత్వంపై ప్రజలే తిరుగుబాటు చేస్తారని ఒక ప్రక టనలో ప్రతాపరెడ్డి హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, వసంత గౌడ్, మహబూబ్ బాషా, రఫిక్ బాయ్, నల్లంపల్లి వీరారెడ్డి కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్స్‌పై ఉచిత శిక్షణ సదస్సు



**వేంపల్లె - సూర్య వాస్తవం :** ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఉన్నత విద్య, పోటీ పరీక్షల విభాగపు అధికారి డాక్టర్ డి.కోనప్ప ఆధ్వర్యంలో "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్మెంట్ అసోసియేట్" అనే అంశంపై రెండు రోజులు ఉచిత వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌ను నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కౌన్సిల్ ఫర్ స్కిల్స్, కాంపిటీషన్స్ వారి భాగస్వామ్యంతో నిర్వాహించారు. ఈ సదస్సులో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంలో విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించే విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వారు అందిస్తున్న 26 వేల రూపాయల ఫీజు కలిగిన ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ కోర్సును ఉచితంగా ట్రిపుల్ ఐటీ లోని 170 మంది షెడ్యూలు తెగలు మరియి షెడ్యులు ట్రైబ్ విద్యార్థులకు ఉచితంగా అందించడానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ కోర్సులో విద్యార్థులకు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ పై శిక్షణ నైపుణ్యాలు పెంపొందించి, ఉచితంగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు, ఉద్యోగాలకు అనుకూలంగా మార్చడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో యన్ఐఈ ఐటీకి చెందిన విద్యాసాగర్, రామమోహన్ రావు, త్రిబుల్ ఐటీ ఎస్టాబ్లిష్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, ఒంగోలు డీన్ ఆఫ్ అకాడమిక్ డాక్టర్ తిలక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# రేపు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 75వ వార్షికోత్సవం

**వేంపల్లె - సూర్య వాస్తవం:** తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 78వ వార్షికోత్సవ కార్యక్రమం మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుందని ప్రధానోపాధ్యాయులు తలిశెట్టి సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమానికి విచ్చేస్తున్న స్థలదాత వారసులు, అతిథులతో కలిసి స్థలదాత కాంస్య విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించిన పిదప ప్రధానోపా ధ్యాయులు, స్థలదాత వారసులు, విచ్చేసిన ముఖ్య అతిధుల సమక్షంలో జాతీయ జెండా మరియు పాఠశాల జెండా ఆవిష్కరణ గావించి, కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తల ప్రసంగాల పిదప వివిధ రకాల కార్యక్రమాలతో సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖకు సంబంధించిన అధికారులు, వేంపల్లి మండల ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు హాజరై పాఠశాల ప్రాముఖ్య తను, విద్య, ఆవశ్యకతను, ప్రస్తుత సమాజంలో విద్యార్థుల కర్తవ్యాలను తదితర అంశాలను గురించి వక్తలు ప్రసంగించెదరు. గత సంవత్సరం పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శాశ్వత దాతలుగా ఉన్నటువంటి వ్యక్తులు వారికి నగదు ప్రోత్సాహ బహుమతిని అందించడం జరుగుతుంది. అలాగే క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దాతల సహాయంతో నగదు ప్రోత్సాహ బహుమతి అందించడం జరుగుతుంది. పిదప ఈ సందర్భంగా జరిగిన ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేయడం జరుగుతుంది. మధ్యాహ్నం రెండు గంటల 30 నిమిషాల నుంచి విద్యార్థులచే వివిధ రకాల సాంస్కృతిక కార్య క్రమాలతో కార్యక్రమం నిర్వ హించబడును. కావున మీరందరూ ఈ కార్యక్రమానికి తప్పక హాజరై కార్య క్రమాన్ని విజయవంతం చేయవ లసిందిగా పేరుపేరునా మీ అందరినీ ఆహ్వానిస్తున్నామని అన్నారు.

# ఏపీజెఏసీ అమరావతి ఎన్నిక రెండవసారి ఏకగ్రీవం

## - పీజెఏసి అమరావతి అనంతపురం జిల్లా చైర్మన్ గా ఆర్ ఎన్ దివాకర్ రావు ఎన్నిక

**అనంతపురం - సూర్య వాస్తవం:** అనంతపురం పట్టణంలోని స్థానిక రెవిన్యూ భవనము, కృష్ణ కలమందిర్‌లో ఆదివారం నాడు ఏపీజెఏసి అమరావతి అనం తపురం జిల్లా ఎన్నికలు నిర్వహించడం నిర్వహించారు. ఏపీ జేఏసీ అమరావతి, అనంతపురం జిల్లా చైర్మన్‌గా దివాకర్ రావు, డిప్యూటీ తహశీల్దార్, (రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్) ఏకగ్రీవముగా 2వ సారి ఎన్నికయ్యారు. పి. ఎస్ ఖాన్, జనరల్ సెక్రెటరీగా, వైస్ చైర్మన్‌గా తలారి పెద్దయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎలెక్షన్ అధికారి శుభాకాంక్షలు తెలిపారు.



# కేంద్ర బడ్జెట్ ఏపీకి నిరాశే మిగిల్చింది

## - డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్




**రాయచోటి - సూర్య వాస్తవం:** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏపీకి నిరాశే మిగిల్చిందని డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ అన్నారు. కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ కు తగిన నిధులు కేటాయించలేదని పోలవరం కు 57 వేల కోట్ల రూపాయల గ్రాంట్‌ను కూటమి రాష్ట్ర ప్రభుత్వం కోల్పో యిందని, రాష్ట్ర ప్రజలపై భారం పడుతుందని ఆయన చెప్పారు. గ్రామీణ అభివృద్ధికి నిధులు తగ్గాయని, వైజాగ్ కు హై స్పీడ్ రైట్ కారిడార్ కేటాయింపు జరగాలని ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం పై ఒత్తిడి చేయక పోవడం దురదృష్ట కరమన్నారు. ఈ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఏమటకు సరిపోతుందో చెప్పాలని కూటమి ప్రభుత్వానికి ఈ సందర్భంగా గాజుల భాస్కర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా అన్ని విధాల అభివృద్ధి చెందిన హైదరాబాద్ నగరం తెలంగాణ రాష్ట్రానికి పోయిన విషయం మీకు తెలుసు. కాబట్టి ఆ మేరకు నవ్యాంధ్రకు న్యాయం చేసేటందుకు సోనియాగాంధీమార్గదర్శకత్వంలో, మన్మో హన్ సింగ్ ప్రధాన మంత్రిగా నవ్యాంధ్రప్రదేశ్ కు మూడు వరాలు ఇవ్వడం జరిగింది . అందులో మొదటి వరం ఆంధ్రప్రదేశ్ లో ఐదు సంవత్సరాల పాటు ప్రత్యేక హోదా అమలు చేయడం. దురదృష్టవశాత్తు 11 సంవత్సరాల అయినా ప్రత్యేక హోదా అమలకు నోచుకోలేదని ప్రత్యేక హోదా తోనే రాష్ట్ర అభివృద్ధిని కూటమి నాయకులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. ఇకనైనా ప్రత్యేక హోదాపై నాయకులు పోరాడాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# వైయస్ షర్మిల "ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర"కు తరలిరండి!

## - జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజుల భాస్కర్

**రాయచోటి - సూర్య వాస్తవం :** పేదవాడికి అండగా, కూలీల హక్కుగా ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం యధావిధిగా కొనసాగించాలని కోరుతూ పిసిసి రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభిమానులందరూ అన్నమయ్య జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్క కూలి భాగస్వాములు కావాలని డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర వివరాలు తెలియజేశారు. ఈనెల 4వ తేదీ మదనపల్లిలో సాయంత్రం 4:00 గంటలకు, పుంగనూరులో 5వ తేదీ ఉదయం 11:00 గంటలకు, అలాగే పీలేరులో సాయంత్రం 4:00 గంటలకు యాత్ర కొన సాగుతుందని తెలియజేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో కోఆర్డినేటర్లు అందరూ షర్మిలా రెడ్డి యాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అలీ ఖాన్, చీఫ్ సెక్రటరీ అమీర్ భాష, జిల్లా ఉపాధ్యక్షుడు దర్బార్, షేక్ అమీర్ భాష, రాయచోటి పట్టణ అధ్యక్షుడు షేక్ బాబా సర్దార్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.




# మంత్రి శ్రీరాములను, ఎమ్మెల్యే పార్థసారథిని వివాహ వేడుకకు ఆహ్వానించిన బండి క్రిష్టప్ప



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప తన కుమారుడు నరేంద్ర వివాహ కార్యక్రమం కు పలువురు ప్రముఖులను ఆహ్వానించారు.



ఆదివారం వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి ఆ సేవాసమితి ఉప కార్యదర్శి నాగలాపురం నారాయణస్వామి, న్యాయ సలహాదారులు న్యాయవాది రవిచంద్ర, ప్రధాన సలహాదారులు తలారి రాజప్ప, విశ్రాంతి డిఎస్పి శ్రీరాములు సభ్యులతో కలిసి ఆయన బళ్ళారి, ఆలూరు, ఆలరివి, ఆదోని తదితర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులను కలుసుకొని పెళ్లి పత్రికలు అందజేసి వివాహ కార్యక్రమం కు ఆహ్వానించారు. మాజీ మంత్రివర్యులు బళ్లారి శ్రీరాములు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, బళ్లారి నగరం మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి బళ్ళారి దివాకర్, గుమ్మనూరు చిన్నాయప్ప లను కలుసుకొని రాయదుర్గం పట్టణం మార్కెట్ యార్డ్ లో జరుగు నున్న తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాస్ సేవా సమితి మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, బోయపాటి ప్రకాష్, హనుమంతరాయుడు, ఆ సేవాసమితి ఉపకోశాధి కారిపై తోట రఘు, సభ్యులు అజయ్ టైలర్ రఘు, ఓబులాపురం తెదేపా గ్రామ అధ్యక్షులు తాయప్ప, మిత్రులు సిద్దేశ్వర పైగేరి, హమాలి యూనియన్ అధ్యక్షులు కురుబ గురుమాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# కుమార్ రెడ్డికి నివాళులర్పించిన రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు

## - కుమార్ మరణం నన్ను కలచివేసింది కాపు రామచంద్రారెడ్డి



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** గుమ్మగట్ట మండలం బేలోడు గ్రామానికి చెందిన కుమార్ రెడ్డి మరణం నన్ను కలిసి వేసిందని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తపరిచారు. కళ్యాణ్ దుర్గం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో కుమార్ రెడ్డి భౌతిక కాయాన్ని పరిశీలించి, కుమార్ రెడ్డికి ప్రభుత్వాసుపత్రిలో ఘన నివాళులు కాపు రామచంద్రారెడ్డి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యు లను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి తెలిపారు.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )